

కూటమి హామీ.. నెరవేరదేమి?

- అమ్మ ఒడికి దీటుగా తల్లికి వందనం అమలు చేస్తామన్న నాయకులు
- పదవిలోకి వచ్చి పది నెలలైనా పది పైసలు విదల్చని వైనం
- వాళ్లు ఇస్తారన్న నమ్మకం పోయిందని తల్లుల నిర్వేదం

జగదాంబ: చదువుకు పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమ్మఒడిని ప్రవేశపెట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలంటూ ఎలాంటి వివక్ష చూపకుండా పిల్లలందరికీ దీన్ని వర్తింపజేశారు. దీంతో పేద పిల్లలు, బడి ముఖం చూడని వారు కూడా బడిబాట పట్టారు. తమ పిల్లల చదువుకు జగనన్న ఆసరా కల్పించి.. అండగా నిలవడంతో రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుకు సంబంధించి ఆలోచించడం ప్రారంభించారు. వారిని బడికి పంపడం మొదలుపెట్టారు. అలా ఒక చిన్న సంస్కరణతో చిన్నారులు చదువులమ్మ ఒడికి చేరేలా జగనన్న సంచలన నిర్ణయంతో శ్రీకారం చుట్టారు.

కూటమి హయాంలో..

కూటమి ప్రభుత్వ హయాంలో అందుకు భిన్నంగా జరుగుతోంది. జగనన్న అమ్మ ఒడి స్ఫూర్తితోనే తల్లికి వందనం ద్వారా బడికి వెళ్లే పిల్లల తల్లుల ఖాతాల్లో పైకం జమ చేస్తామని ప్రకటించారు. కేవలం పథకం పేరు మార్చారు తప్ప మిగిలినదంతా సేమ్ టు సేమే. అయితే గొప్పగా దాన్ని ప్రకటించారు కానీ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు అవుతున్నా ఎక్కడా ఆ వినికిడి కూడా లేదు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ పథకం వర్తింపజేస్తామన్న లోకేష్ మాటలు ఇప్పుడు ఏమయ్యాయని తల్లులు ప్రశ్నిస్తున్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ఉత్సాహంగా పిల్లల్ని బడికి పంపించిన తల్లులు నేడు ఫీజులు చెల్లించలేక వెనుకంజ వేస్తున్నారు.



తమ చిన్నారి చదువుకు ఏ సాయం అందలేదంటున్న ప్రసాద్‌గార్డెన్స్‌లోని ఓ తల్లి

జగనన్న హయాంలో అన్ని వసతులు..

కేలవం అమ్మఒడి మాత్రమే కాకుండా విద్యాదీవెన పథకం ద్వారా పిల్లలకు కావాల్సిన పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, సాక్స్‌ల వంటివి ఇచ్చి తల్లిదండ్రులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చేశారు జగనన్న. కానీ ప్రస్తుతం ఫీజులే కట్టలేని మేము ఇక పిల్లలు బడికెళ్లేందుకు మిగిలిన సదుపాయాలు ఎక్కడ సమకూర్చగలమని పేద తల్లులు వాపోతున్నారు.

జగనన్న మేలు మరువలేం..

నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరినీ బడికి పంపించి చదివిస్తున్నాను. చాలా కష్టంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన పథకాలు ఇప్పుడు అమలు కావడంలేదు. నాడు జగనన్న అమ్మఒడి పథకం అమలు చేసేవారు. దాంతో పిల్లల చదువులు భారం అనిపించేది కాదు. ఇప్పుడు దగ్గర దగ్గర ఏడాది కావస్తున్నా ఈ ప్రభుత్వం తల్లికి వందనం ఊసే ఎత్తడంలేదు.

– వరలక్ష్మి, పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

అమ్మఒడి ఒక ధైర్యం..

అమ్మఒడి పిల్లల చదువులకు భరోసా కల్పించేది. పిల్లలు పైచదువులకు వెళ్లే కొద్దీ భయం ఉండేది కాదు. ఇప్పుడు ధైర్యం కోల్పోయాం. పిల్లలకు కూటమి ప్రభుత్వం చెప్పినట్లు తల్లికి వందనం రాలేదు. వస్తుందన్న నమ్మకమూ లేదు. ఫీజులు కట్టి పిల్లల్ని బడికి పంపించేందుకు చాలా కష్టంగా ఉంది. ఇక పుస్తకాలు, ఇతరత్రా అంటే మాకు తలకు మించిన భారమే అవుతుంది. – రామలక్ష్మి, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

ఈ ఏడాది బడికి పంపలేం..

నేను పూర్ణామార్కెట్‌లో పని చేస్తున్నాను. వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. మా పాప చదువుకు ఈ ఏడాదే ఇబ్బందిపడుతున్నాం.. ఇక వచ్చే ఏడాది బడికి పంపించలేం. జగనన్న హయాంలో అమ్మఒడితో ఆదుకున్నారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. ఇలా అయితే నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎలా చదివించగలరు?

– కామాక్షి, వెలంపేట, జీవీఎంసీ 35వ వార్డు



తల్లికి వందనం అందలేదంటున్న పండా వీధికి చెందిన ఓ తల్లి

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న భీమరశెట్టి విశ్వనాథం

అల్లిపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణన చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయన గురువారం ఉదయం జిల్లా కోర్టు జంక్షన్‌లో గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సవరాల రమేష్, బీఎస్పీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు శిక్షణ



పేపర్ క్రాఫ్ట్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో ముందుగా విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఎం.శిరీష పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి రోజూ కనీసం గంట సేపు పుస్తకాలు చదవాలని ఆమె సూచించారు. నీతి కథలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు పేపర్ కటింగ్ ద్వారా వివిధ రకాల వస్తువులు తయారు చేశారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



దాతలు అందించిన జెర్సీలు, షూస్, బాల్స్ తదితర మెటీరియల్‌తో చిన్నారులు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో గురువారం శ్రీపోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు షార్ట్‌లు, జెర్సీలు, షూస్, బాల్స్ తదితర మెటీరియల్‌ను ఎస్.కృష్ణ, ఎస్.గురునాథ్‌ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడైన మంతెన రాంజీ అందించారు. శిబిరానికి కోచ్‌గా అనకాపల్లి శివ, బోర చినరెడ్డి వ్యవహరిస్తారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, సీనియర్ క్రీడాకారులు శొంఠ్యాన జడ్సన్ రాబర్ట్‌సన్, చేట్ల వెంకటరెడ్డి, సన్ని, సమ్మి మురళి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, అనకాపల్లి గిరి, మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లి ఔదార్యం



సత్యవతికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీరాభిమాని, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బొండాడ వెంకట్రావు భార్య అనారోగ్యంతో బాధపడుతున్న దృష్ట్యా అవసరమైన వైద్య ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం అందజేశారు. యూరాలజీ సమస్యతో బాధపడుతున్న వెంకట్రావు భార్య సత్యవతి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేస్తూ అధైర్యపడొద్దని అండగా ఉంటామని వాసుపల్లి భరోసా కల్పించారు. అనంతరం వాసుపల్లి సింహాచలం చందనోత్సవంలో జరిగిన దుర్ఘటనకు సంబంధించి మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జననేత జగన్‌మోహన్‌రెడ్డి విషయం తెలుసుకుని ప్రభుత్వం చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు ప్రకటించిందన్నారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే పరిగణిస్తున్నామని, తక్షణమే బాధితులకు రూ.కోటి పరిహారం ఇవ్వకపోతే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, మిగిలిన రూ.75 లక్షలు అందిస్తామని జగనన్న ప్రకటించడం గర్వకారణమన్నారు. కూటమి ప్రభుత్వ తప్పిదాల వల్లే నేడు 7 ప్రాణాలు బలయ్యాయని అన్నా రు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని సంక్షేమ పాలనపై దృష్టి సారించాలని వాసుపల్లి హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, ముజీబ్‌ఖాన్, బెవర మహేష్, ఆకుల శ్యామ్, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



యూనివర్సల్ గ్రంథాలయం వద్ద మజ్జిక పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



అల్లిపురంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న విద్యార్థులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, శ్రీ గౌరీ వివేక్ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతి ఏడాది మజ్జిగ పంపిణీ చేపడుతుంటామని ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు రాపేటి శేఖర్ తెలిపారు. ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా మజ్జిగ పంపిణీ చేపడుతున్నామన్నారు. ట్యూషన్ సెంటర్ విద్యార్థులకు చదువుతో పాటు సేవా కార్యక్రమాలు కూడా నేర్పిస్తుంటామన్నారు.

యూనివర్సల్ గ్రంథాలయం వద్ద..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు యూనివర్సల్ గ్రంథాలయం వద్ద గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతుబజార్‌కు వచ్చే వినియోగదారుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు గ్రంథాలయం ప్రెసిడెంట్ వాడుబోయిన గురుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అప్పారావు, జాయింట్ సెక్రటరీ వెంకట్, బంగారురాజు, హరీష్ (అప్పు), మల్లికార్జున్, దేవుడు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కథలు విన్న చిన్నారులు



పిల్లలకు చెస్‌లో మెలకువలు నేర్పుతున్న రిసోర్స్‌పర్సన్ శివశంకర్

డాబాగార్డెన్స్: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో గురువారం కాకమ్మ కథలు చెప్పారు. రిసోర్స్‌పర్సన్ పి. శ్రీనివాసరావు పిల్లలకు కాకమ్మ కథలు చెప్పగా.. మరో రిసోర్స్‌పర్సన్ కె. శివశంకర్ పిల్లలకు చెస్ నేర్పించారు. సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేసవి శిబిరంలో పాల్గొన్న పిల్లలకు ఫ్రూట్స్ అందజేసినట్లు గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి తెలిపారు.

ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం



ఇంగ్లిష్ నేర్చుకుంటున్న చిన్నారులు

మల్కాపురం: ఆంగ్ల భాషా పరిజ్ఞానం వల్ల మరిన్ని విషయాలు తెలుసుకోగలమని మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం గ్రంథాలయ ఆవరణంలో చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతి నిర్వహించారు. ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఇంగ్లిష్ టీచర్ శేషు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లిపురం: అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సీడీపీవో ఎంవీ రమణకుమారి తెలిపారు. గురువారం అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణకు సంబంధించిన అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. శిక్షణలో భాగంగా కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల హక్కులు, చట్టాల గురించి వివరించాలని సూచించారు. బాల్య వివాహాల కట్టడి, బాలికల అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కిశోర బాలికల శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ బి.మమత, కె.శకుంతల, ఐ.సులేఖ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు చిరిగిన భారీ బ్యానర్లు

ఏయూక్యాంపస్: నగరంలో ఈదురు గాలులతో కురిసిన వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లకు ఏర్పాటు చేసిన భారీ బ్యానర్లు చిరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇవి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌కు చేరువలో ఉన్న భారీ హోర్డింగ్ బ్యానర్ చిరిగిపోయి కిందకు వేలాడుతోంది. వాహన చోదకులకు, కార్లకు ఇది తగిలేలా ఉండటంతో జీవీఎంసీ సిబ్బంది వెంటనే స్పందించారు. వేలాడుతున్న ప్లాస్టిక్ బ్యానర్లను అతికష్టం మీద తొలగించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ఎటువంటి ప్రమాదం జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్ పక్కనే ఉన్న భారీ హోర్డింగ్‌కు సంబంధించిన బ్యానర్లు సైతం గాలికి చిరిగిపోయి వేలాడుతున్నాయి. వీటిని నిర్వాహకులు తొలగించాల్సిన అవసరం ఉంది.



బీచ్ రోడ్డులో గాలికి చిరిగి వేలాడుతున్న హోర్డింగ్ బ్యానర్

శిథిలావస్థలో పెన్షనర్ల సంఘ భవనం

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని పెన్షనర్ల సంఘ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని భూత్ బంగ్లాను తలపిస్తోంది. కూలిపోవడానికి సిద్ధంగా భవనం ఉందని పెన్షనర్లు గగ్గోలు పెడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందో అన్నట్టుగా ఉందని పెన్షనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ ఆఫీస్ ఆవరణలోని ఖజానా కార్యాలయానికి లైఫ్ సర్టిఫికెట్లు, పెన్షన్ హెచ్చుతగ్గులు, బకాయిలు వంటి పలు పనుల నిమిత్తం పెన్షనర్లు రోజూ అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు విశాఖ జిల్లా పెన్షనర్లు ఇక్కడికి తరలి వస్తారు. ఎన్నో ఏళ్ల కిందటే ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పెన్షనర్లు కూర్చోవడానికి నీడ కరువైంది. ఫలితంగా ఖజానా కార్యాలయానికి వచ్చే వారు గట్లు, చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ భవనానికి ఏళ్ల తరబడి కనీసం ప్యాచ్ వర్క్‌లు సైతం నిర్వహించక పోవడంతో కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో గీతా సత్సంగం కూడా కొన్నేళ్ల పాటు నిర్వహించారు. భగవద్గీత కార్యక్రమాలు జరిగేవని పెన్షనర్లు గుర్తు చేశారు.



శిథిలావస్థకు చేరిన పెన్షనర్ల సంఘ భవనం

సింహాచలం డిపో ఇన్‌చార్జి డీఎంగా శరత్‌బాబు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి డీఎంగా ఎస్.శరత్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజశేఖర్‌కు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా (జోన్–1) పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌బాబును రాజశేఖర్, ఉద్యోగులు అభినందించారు.



శరత్‌బాబును అభినందిస్తున్న ఉద్యోగులు

ఉద్యమాలే ఊపిరిగా..అరుణపతాక రెపరెప

- వాడవాడలా మేడే వేడుకలు
- అశువులు బాసిన అమరులకు ఘనంగా నివాళి



జగదాంబ సెంటర్ సిటు కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్



అల్లిపురంలో పతావిష్కరణ చేస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి



కంచరపాలెం కూడలిలో ర్యాలీగా వెళ్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు



టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న వామనమూర్తి



మేడే వేడుకలు జరుపుకుంటున్న 35వ వార్డు ఆటో కార్మికులు

డాబాగార్డెన్స్: మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకు పోరాడాలని, మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు జిల్లా కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు పి. వెంకట్‌రెడ్డి, వై. రాజు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల యజమానులకు అనుకూలంగా మార్పులు చేస్తుందన్నారు. అందులో భాగంగా 29 కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకువచ్చిందన్నారు. అవి అమలు జరిగితే కార్మికులు బానిసల కన్నా హీనంగా బతకాల్సి ఉంటుందన్నారు. వాటి రద్దుకు పోరాడాలన్నారు. సిటు నాయకులు వెంకట్‌రెడ్డి, వై. రాజు, ఎం. సుబ్బారావు, టి. నూకరాజు, పి. మణి, జి. అప్పలరాజు, పోలేశ్వరరావు, సూరీడు తదితరులు పాల్గొన్నారు.

ప్రసార మాధ్యమాల తప్పుడు ప్రచారం..

అల్లిపురం: దేశంలో కార్పొరేట్లకు అధిపతులుగా ఉన్నవారందరూ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రసార మధ్యమాలు ప్రచారం చేస్తున్నాయని విశాఖపట్నం హార్బర్–పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన జెండా ఎగరేసి మాట్లాడారు. 8 గంటల పనిదినం ఎవరో ఊరకే ఇచ్చింది కాదని వేలాది మంది కార్మికులు ప్రాణాలొడ్డి సాధించుకున్న హక్కు అని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, రాష్ట్ర సమితి సభ్యుడు, పార్టీ సీనియర్ నాయకుడు సీహెచ్ రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, పాత్రపల్లి చంద్రశేఖర్, జి, కాసులరెడ్డి, నెయ్యాల నాగభూషణం, అప్పికొండ దేముడమ్మ, బొత్స పుష్పలత, నెలివాడ అప్పన్న, పి. నారాయణరావు, పి.ఎ. రాజు, ఎ. రవి, కె. తిరుపతిరావు, ఎం. శ్రీనివాసరావు, జి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో పలు కార్మిక సంఘాలు ఘనంగా మేడే వేడుకలు నిర్వహించాయి. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వార్డులో నూనెమిల్లు వీధిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే పూర్ణామార్కెట్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో, స్ప్రింగ్‌రోడ్డులో కళాసీలు, బొడారారోడ్డు, జనతాబజార్, వెలంపేట వద్ద, ఫ్రూట్‌మార్కెట్‌లో, పాత బస్టాండ్ వద్ద వివిధ కార్మిక సంఘాలు మేడే జరిపాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతు కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

సీతమ్మధార: మేడే సందర్భంగా జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద దుస్తుల వ్యాపారుల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి పాల్గొని జెండా ఎగరేశారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్ సంస్థలకు అనుకూలంగా కార్మికులకు నష్టం కలిగించే విధానాలు అమలు చేస్తోందని దుయ్యబట్టారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రెహ్మాన్, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాత్రపల్లి చంద్రశేఖర్, భీంపల్లి రాము, సుంకర నగేష్, శ్రీను, ఎస్. నాగభూషణ్, కె. లక్ష్మణరావు, శివాజీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి..

టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకులు మేడే నిర్వహించారు. వరుణ్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వెయ్యి మందికి చాక్లెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి, జె.వి ప్రభాకర్ మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని విమర్శించారు. ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రవి కృష్ణ, యు. శివాజీ, శ్రీను, శేషు నాయుడు, సలీం, బి. అప్పలరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం..

కంచరపాలెం: కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం అని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. జ్ఞానాపురంలో జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ఆరెస్సెస్, బీజేపీ కార్మికులు, ప్రజల హక్కులపై దాడి చేస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలను అంతమొందించి అడవులను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి, మావోయిస్టులపై చట్టవిరుద్ధంగా యుద్ధం చేస్తున్నారని తెలిపారు. విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, పీవోడబ్ల్యు అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఎం సురేష్, కె.రవి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.